



# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం

సంపుటి : 3 | సంచిక : 241 | ఏప్రిల్ 28 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-










# కార్పొరేట్ కబంధహస్తాల్లో విద్య

## మార్కుల యంత్రాలుగా విద్యార్థులు

- ప్రవేశాలు, విరాళాల పేరుతో లక్షల వసూళ్లు
- మార్కుల ఒత్తిడితో బాల్యం క్షీణం
- తల్లిదండ్రులపై అప్పుల భారం
- ప్రభుత్వ విద్యకు తగ్గుతున్న అదరణ

### ప్రత్యేక కధనం

మన దునియా,హైదరాబాద్: బ్యూరో ఏప్రిల్ 27

విద్య వ్యక్తిని విజ్ఞానవంతుడిగా తీర్చిదిద్దాల్సిన మూలాధారం. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అదే విద్య విద్యార్థులను 'మార్కుల యం త్రాలు'గా, తల్లిదండ్రులను 'అప్పుల భారంతో సలిగే వర్గం'గా మార్చుతున్న దృశ్యం స్పష్టమ వుతోంది. పవిత్రమైన బడి వ్యవస్థ, కార్పొరేట్ శక్తుల ఆధీనంలో వ్యాపార కేంద్రంగా మారి, విద్యా రంగం దిశ తప్పుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.సాంప్రదాయంగా సరస్వతీ నిలయాలుగా భావించబడిన విద్యాసంస్థలు, ప్రస్తుతం లాభాల దిశగా నడిచే సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయి. అక్షరాలు కూడా మార్కెట్ లో అమ్మకానికి పెట్టే వస్తు వులుగా మారుతున్నాయి. చదువు అవసరం మాత్రమే కాకుండా ప్రతిష్ఠకు ప్రతీకగా మారి పోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రవేశ ప్రక్రియలు భారీ ఆర్థిక భారం మోపుతున్నాయి. ప్రవేశా లు, విరాళాలు, పునఃప్రవేశాల పేర్లతో లక్షల రూపాయలు వసూలు చేయడం సాధారణమై పోయింది. పాఠశాలలు పుస్తకాలు, దుస్తులు, ఇతర అవసరాలను తమ వద్దే కొనాలని నిర్బంధించడం ద్వారా విద్యను సంపూర్ణ వ్యాపార ప్రక్రియగా మార్చుతున్నాయి. ఉచిత అవకాశాలు కాగితాలకే పరిమితమవడం. ఆందోళన కలిగిస్తోంది. కార్పొరేట్ కాలేజీల్లో విద్య నాలుగు గోడల మధ్య పరిమితమవుతోంది. దీర్ఘకాలిక తరగతులు, నిరంతర పరీక్షలు, ర్యాంకుల ఒత్తిడితో వి ద్యార్థుల బాల్యం క్షీణిస్తోంది. సృజనాత్మకత, విలువలు, సామాజిక అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. విద్యా ర్థులు సంపూర్ణ వ్యక్తిత్వం కాకుండా పరీక్షలకే పరిమితమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.ఇంతటి ఖర్చు పెట్టి చదివిస్తున్న తల్లిదండ్రులు కూడా మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పిల్లల పరిస్థితిపై

(మిగతా 2వ పేజీలో..)

## మే 4న బెంగాల్‌లో మిఠాయిలు పంచుతాం: ప్రధాని నరేంద్రమోదీ

### బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారానికి తాను బెంగాల్ వస్తానన్న మోదీ

### దేశ ప్రజలే తన కుటుంబమని వెల్లడి

### టీఎంసీ హయాంలో నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శలు

మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి తాను



## విజయ్ ఎన్నికల అఫిడవిట్‌పై విచారణకు నో.. పిటిషన్‌ను కొట్టివేసిన మద్రాస్

### నటుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌పై విచారణ కోరిన పిటిషన్‌ను కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు

### ఆర్థిక వివరాలు తప్పుగా చూపారని, కొన్ని అంశాలు దాచిపెట్టారని పిటిషనర్ ఆరోపణ

### విజయ్‌పై దాఖలైన ఇలాంటి మరో పిటిషన్ హైకోర్టులో ఇంకా విచారణ దశలోనే ఉన్న వైనం

నటుడు, 'తమిళగ వెట్రి కళగం'

2



## బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం.. 'ఎక్స్' వేదికగా కేటీఆర్, హరీశ్ రావు ట్వీట్

### నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండా పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని వ్యాఖ్య

### తెలంగాణ జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిందన్న హరీశ్ రావు



2

## ఐసీసీసీ కేంద్రంలో పోలీస్ స్పందన టీమ్స్ ప్రారంభం

### మహిళలు, చిన్నారుల రక్షణకు కీలక అడుగు

మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 27

హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఒకే ఒకే మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఐసీసీసీ కేంద్రంలో పోలీస్ స్పందన టీమ్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి అనిల్ కుమార్ యాదవ్, డీజీపీ శివధర్ రెడ్డి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, చిన్నారులు, బాలికలు, మహిళల రక్షణ కోసం మహిళ పోలీసులతో ప్రత్యేకంగా స్పందన టీమ్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని పేర్కొన్నారు. "స్పందన అంటే బాధితులకు తక్షణ రక్షణ అందించే పోలీస్ ఫోర్స్. వేధింపులు, హింసకు గురైన వారికి వెంటనే సహాయం అందించడం ఈ టీమ్స్ ప్రధాన లక్ష్యం" అని తెలిపారు.బాధితుల మానసిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంటుందని, ఆ క్షణంలో ఎవరో తమను రక్షిస్తే బాగుంటుందనే ఆవేదన




(మిగతా 2వ పేజీలో..)

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# మే 4న బెంగాల్‌లో మిఠాయిలు పంచుతాం: ప్రధాని నరేంద్రమోదీ

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి బెంగాల్ వస్తానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో నేడు బారక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన చివరి ర్యాలీలో మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తుందనే ఉత్సాహంతో తాను ఢిల్లీకి వెళుతున్నానని అన్నారు.తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల మేర ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని తెలిపారు. తనను ఆశీర్వదించడానికి ఇంతమంది ప్రజలు వస్తారని ఊహించలేదని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చి బీజేపీలో చేరిన తర్వాత ఒక కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా అది చేశానని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఒక కుటుంబం అంటూ లేదని, దేశ ప్రజలే తన కుటుంబమని వ్యాఖ్యానించారు.గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని మోదీ అన్నారు. ఈ రోడ్డు షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. నాడు టీఎంసీ అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్ని వారు వదిలివేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారం సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. టీఎంసీ పాలనలో మహిళలపై గతంలో ఎన్నడూ లేనివిధంగా దాడులు జరిగాయని మండిపడ్డారు. నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే నిందితులను వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు.

## బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం.. 'ఎక్స్' వేదికగా కేటీఆర్, హరీశ్ రావు ట్వీట్

బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని, ఇది ఒక విప్లవమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 26వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండా ఈరోజుతో పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని తెలిపారు. స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం రెపరెపలాడుతూసిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకను జరుపుకుంటున్న సన్నివేశం ఇది అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల మైలురాయిని అధిగమించిన మహోజ్వల లాంగ్ మార్చ్ అని తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్లకు, అభిమానులకు, నాయకులకు, ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

**తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిన ప్రపంచానికి అందించింది: హరీశ్ రావు**

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కవితారూపంలో పార్టీ గురించి ట్వీట్ చేశారు."నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసి విప్లవ శంఖం మోగించిన ధిక్కార వేదిక,సమైక్య సంకెళ్లను తెంచి స్వరాష్ట్ర కాంక్షను సాకారం చేసిన యుద్ధ గీతిక,పదేళ్ల పాలనతో ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దిన అభివృద్ధి పతాక,తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గులాబీ దీపిక,ప్రజల విశ్వాసానికి ప్రతీక, ప్రజా ఉద్యమ పతాక.. భారత రాష్ట్ర సమితి 26 వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు" అంటూ రాసుకొచ్చారు.పాపపు పాలనలో ప్రజల జీవితాలు నలిగిపోతున్న వేళ, ప్రజల గుండెల్లో 'రేవంత్ పోవాలి, కేసీఆర్ రావాలి' అనే నినాదం మార్మోగుతుందని పేర్కొన్నారు. సంక్షేమం అడుగంటి, అభివృద్ధి నిలిచిపోయి, అరాచకం తాండవం చేస్తున్న కాలంలో అదే నినాదం వినిపిస్తోందని అన్నారు.ఉద్యమంలోనైనా, అధికారంలోనైనా, ప్రతిపక్షంలోనైనా ఎప్పుడూ ప్రజల పక్షానే నిలబడి, తెలంగాణను కంటికి రెప్పలా కాపాడుకున్న పార్టీ మన బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. పోరాటాల పునాది మీద పుట్టి, ప్రజల విశ్వాసంతో ఎదిగి, ప్రతి గుండెలో నాటుకుపోయిన గులాబీ శక్తియే బీఆర్ఎస్ అన్నారు. గులాబీ జెండా సగర్వంగా ఎగిరే రోజు ఎంతో దూరంలో లేదని తెలిపారు. నిలిచిపోయిన తెలంగాణ ప్రగతి రథం మళ్లీ పరుగులు తీసే రోజు ఎంతో దూరంలో లేదని హరీశ్ రావు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరడం రిస్కీ పని: యువతి సమాధానంతో రాహుల్ గాంధీ నవ్వులు

**ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముచ్చట్లు**

**యువతి సమాధానానికి సరదాగా నవ్విన రాహుల్ గాంధీ**

**అవును.. నిజంగానే రిస్క్ అన్న రాహుల్ గాంధీ**

మీ జీవితంలో మీరు చేసిన అత్యంత రిస్కీ పని ఏమిటి? అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించగా, ఓ విద్యార్థిని నుంచి ఊహించని సమాధానం వచ్చింది. దీనితో అక్కడ కొన్ని క్షణాలు నవ్వులు విరబూశాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ఢిల్లీ యూనివర్సిటీ, గార్గీ కాలేజీలకు చెందిన విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. ఆ సమయంలో "మీరు చేసిన అత్యంత సాహసోపేతమైన పని ఏమిటి?" అని విద్యార్థినులను రాహుల్ గాంధీ ప్రశ్నించారు. అక్కడున్న వారిలో ఒక విద్యార్థిని స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీలో చేరడం అత్యంత సాహసోపేతమైనదని పేర్కొన్నారు. ఈ సమాధానంతో రాహుల్ గాంధీ కూడా నవ్వేశారు. "అవును, అది నిజంగా సాహసోపేతమైనదే" అంటూ బదులిచ్చారు. దీంతో రాహుల్ గాంధీతో పాటు విద్యార్థినులందరూ సరదాగా నవ్వారు. రాహుల్ గాంధీ యువ ఓటర్లతో మమేకవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కాలేజీ విద్యార్థినులతో జరిగిన కార్యక్రమంలో ఈ సరదా సంభాషణ జరిగింది.



# ఐసీసీసీ కేంద్రంలో పోలీస్ స్పందన టీమ్స్ ప్రారంభం






(మొదటి పేజీ తరువాయి)

మహిళల్లో ఉంటుందని ఆమె అన్నారు. తక్షణ స్పందన లేకపోతే ప్రాణాపాయం కలగవచ్చని, కొన్నిసార్లు ప్రాణనష్టం కూడా సంభవించే ప్రమాదం ఉందని చెప్పారు. అలాంటి క్రిటికల్ సమయంలో స్పందన టీమ్స్ అత్యంత కీలకంగా పనిచేస్తాయని వివరించారు.ప్రమాదం జరిగిన తర్వాత "గోల్డెన్ అవర్స్" చాలా ముఖ్యమని, ఆ సమయంలో సరైన వైద్యం, సహాయం అందిస్తే బాధితుల ప్రాణాలను కాపాడటమే కాకుండా, వారికి కొత్త జీవితం ఇవ్వగలమని మంత్రి సీతక్క అన్నారు.మహిళా భద్రత విషయంలో తెలంగాణ పోలీసులు వాయువేగంతో పనిచేస్తున్నారని, నిందితులను త్వరగా పట్టుకుని కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. "న్యాయం ఆలస్యమైతే అన్యాయం జరిగినట్టే" అని పేర్కొంటూ, మహిళలకు సత్వర న్యాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.ఇంకా, మహిళలను గౌరవించే విధంగా విద్యార్థులలో పెంపొందించేందుకు పాఠ్యాంశాలు చేర్చాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. "శిక్షతో పాటు శిక్షణ కూడా అవసరం. అప్పుడే నేరాలను నిరోధించగలుగుతాము" అని అభిప్రాయపడ్డారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచుతామని, మహిళలు స్వేచ్ఛగా, భయంలేకుండా పనిచేసే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# కార్పొరేట్ కబంధహస్తాల్లో విద్య

ఆందోళన పెరుగుతోంది. చదువు ప్రతిష్ఠగా మారడంతో. ఏ విద్యాసంస్థలో చదువుతున్నారనే ప్రశ్న కూడా సామాజిక ఒత్తిడిగా మారింది. ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకం తగ్గడం, కార్పొరేట్ వైపు మొగ్గు పెరగడం గమనార్హం.ఈ ప్రభావం పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా పల్లెల వరకు విస్తరించింది. గ్రామీణ, మధ్యతరగతి కుటుంబాలు పిల్లల భవిష్యత్తు కోసం భారీ ఖర్చులు భరించాల్సి వస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు లక్ష రూపాయల వరకు ఖర్చవుతుండగా, ఇంటర్మీడియట్ దశలో ఈ వ్యయం మరింత పెరిగి రెండు నుంచి నాలుగు లక్షల వరకు చేరుతోంది. దీంతో అప్పులు చేయడం సామాన్య కుటుంబాలకు తప్పనిసరి అవుతోంది. పోటీ వాతావరణంలో వెనుకబడిపోతారనే భయంతో పిల్లలను మహానగరాల్లోని కార్పొరేట్ కాలేజీలకు పంపించే పరిస్థితి నెలకొంది. చిన్న పట్టణాల్లోని విద్యాసంస్థలు క్రమంగా బలహీనపడుతున్నాయి. మరోవైపు, ఆకర్షణీయ ప్రకటనలు, హోర్డింగులు,తెలంగాణ ఏర్పాటుకు ముందు నుంచే ఉన్నకా ర్పొరేట్ విద్యాసంస్థల ప్రభావం ఇప్పటికీ కొన సాగుతోంది. ఇతర ప్రాంతాల విద్యావ్యాపార వర్గాలు కూడా తమ కార్యకలాపాలను విస్త రించాయి. అనుమతుల మంజూరులో ప్ర మాణాలు, పర్యవేక్షణలో లోపాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వాలు మారుతున్నా విద్యా వ్యవస్థలో గణనీ యమైన మార్పు కనిపించడం లేదు. కొన్ని రా ష్ట్రాలు ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యను సమర్థంగా అమలు చేస్తున్నప్పటికీ, మన రా ష్ట్రంలో ఆ దిశగా పురోగతి మందగించింది. ప్రకటించిన పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం గమనించాల్సిన విషయం.ఈ నేపథ్యంలో సమగ్ర సంస్కరణలు అవసరం. ఫీజుల నియంత్రణకు కఠిన విధానాలు అమలు చేయాలి.




విద్యాసంస్థలపై పర్యవేక్ష ణను బలోపేతం చేయాలి. ఫీజు నిర్మాణాన్ని పారదర్శకంగా ప్రకటించే విధానం తీసుకు రావాలి. నిబంధనలు అతిక్రమించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ ను బలోపేతం చేయడం అత్యవసరం. నాణ్య మైన మౌలిక వసతులు, ఉత్తమ బోధన అం దుబాటులోకి తేవాలి. పేదవర్గాలకు ఉచిత, నాణ్యమైన విద్య అందించాలి. విద్యార్థిని మార్కుల యంత్రంగా కాకుండా విలువలతో కూడిన వ్యక్తిగా తీర్చిదిద్దేదిశగా చర్యలు తీసు కోవాలి. అప్పుడే 'చదువులమ్మ చెరసాల'గా మారిన ఈ వ్యవస్థ నుంచి విద్యార్థులకు విముక్తి లభిస్తుంది.

# విజయ్ ఎన్నికల అఫిడవిట్‌పై విచారణకు నో.. పిటిషన్‌ను కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ చీఫ్ విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం ఆయన దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్‌లోని ఆర్థిక వివరాలపై విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.వివరాల్లోకి వెళితే... చెన్నైకి చెందిన ఎంపీ వెంకటేశ్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. పెరంబూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విజయ్ తన ఫారం 26 అఫిడవిట్‌లో ఆర్థిక వివరాలను తప్పుగా చూపారని, కొన్ని కీలక విషయాలను దాచిపెట్టారని పిటిషనర్ ఆరోపించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు, అనుబంధ సంస్థలకు కోట్ల రూపాయల విలువైన రుణాలు ఇచ్చినట్లు చూపిన విజయ్, అదే సమయంలో తనకు ఎలాంటి అప్పులు లేవని ప్రకటించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన భార్యకు రూ.12 కోట్లకు పైగా రుణం ఇచ్చినట్లు పేర్కొనడం వంటి లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయని తెలిపారు.ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 సెక్షన్ 33ఏ ప్రకారం అభ్యర్థులు పూర్తి, పారదర్శకమైన సమాచారం ఇవ్వాలని, కానీ విజయ్ సమర్పించిన వివరాలు ఓటరుకు సమాచారం తెలుసుకునే హక్కును కాలరాసేలా ఉన్నాయని పిటిషనర్ వాదించారు. ఈ వ్యవహారంపై ఆదాయపు పన్ను శాఖ, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఎన్నికల సంఘంతో ప్రాథమిక విచారణ జరిపించాలని కోరారు.అయితే, ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి సంజయ్ వి. గంగాపూర్వాలా ధర్మాధికారి, జస్టిస్ అరుళ్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం, పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండానే కొట్టివేసింది. ఎలాంటి విచారణకు ఆదేశించకుండానే పిటిషన్‌ను తిరస్కరించింది. కాగా, విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లోని అవకతవకలపై దాఖలైన మరో పిటిషన్ ఇప్పటికే హైకోర్టులో విచారణలో ఉంది. ఆ కేసులో రూ.100 కోట్లకు పైగా వివరాలు వెల్లడించలేదని ఆరోపణలు రావడంతో కోర్టు ఈ నెల 20న కేంద్ర ఎన్నికల సంఘం, ఆదాయపు పన్ను శాఖకు నోటీసులు జారీ చేయడం గమనార్హం. విజయ్ 2024లో 'తమిళగ వెట్రి కళగం' పార్టీని స్థాపించి, 2026 ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణ స్వీకారం..

**హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి**

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 27**



తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంగా ఇద్దరు ప్రముఖులు ఎమ్మెల్సీలుగా ఈరోజు (సోమవారం) ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొఫెసర్ కోదండరాం, మహ్మద్ అజారుద్దీన్ శాసనమండలి సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై అభినందనలు తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి అజారుద్దీన్ మాట్లాడారు.

**మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తా: మంత్రి అజారుద్దీన్**

తాను కెప్టెన్ కాదని.. తమ కెప్టెన్ రేవంత్‌రెడ్డి అని మంత్రి అజారుద్దీన్ వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో క్లీన్‌బౌల్డ్ ఉండదని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో చూస్తూ, ఆడుకుంటూ వెళ్లాలని అన్నారు. తనకు పొలిటికల్ ఫ్యాన్స్ కంటే.. క్రికెట్ ఫ్యాన్స్ ఎక్కువ అని తెలిపారు. పొలిటికల్ ఫ్యాన్స్‌ను కూడా తాను పెంచుకుంటానని తెలిపారు. తనకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పెద్దలు తన కోసం చాలా చేశారని ప్రస్తావించారు. ప్రజల కోసం ఇంకా కష్టపడి పని చేస్తానని




స్పష్టం చేశారు. మైనార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీల కోసం చాలా సహాయం చేశారని తెలిపారు. ప్రత్యర్థి పార్టీలు ఏమైనా మాట్లాడటం సహజమని పేర్కొన్నారు.

**నాకు మంత్రి పదవిపై ఆశ లేదు: కోదండరాం**

తనకు మంత్రి పదవిపై ఆశ లేదని ఎమ్మెల్సీ కోదండరాం వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్ధవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు..

# ఉమ్మడి కొత్తగూడలో పెట్రోల్ కష్టాలు..





**బారులు తీరిన వాహనదారులు**

**మన దునియా,మహబూబాబాద్: ఏప్రిల్ 27**

మహబూబాబాద్ జిల్లాలో పెట్రోల్ సెగ రాజుకుంది. ఏజెన్సీ ప్రాంతమైన ఉమ్మడి కొత్తగూడ మండలంలో పెట్రోల్ కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెట్రోల్ బంకులన్నీ వెలవెలబోతున్నాయి. గత కొన్ని గంటలుగా బంకుల వద్ద వాహనదారుల రద్దీ పెరగగా, ఉన్న పెట్రోల్ నిల్వలు అయిపోవడంతో బంక్ నిర్వాహకులు 'నో స్టాక్' బోర్డులను వేలాడదీశారు.దీనివల్ల నిత్యం రాకపోకలు సాగించే స్థానికులు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనుల మీద వెళ్లాల్సిన వాహనదారులు, ఆస్పత్రులకు వెళ్లేవారు పెట్రోల్ లేక నడిరోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు.చాలా మంది వాహనదారులు పెట్రోల్ కోసం గంటల తరబడి బంకుల వద్దే వేచి చూస్తున్నా, పెట్రోల్ రాకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఈ పరిస్థితులపై అధికారులు స్పందించి, వెంటనే పెట్రోల్ సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో వాహనదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఉమ్మడి కొత్తగూడ మండలంలోని పెట్రోల్ బంకులకు ఇంధనాన్ని సరఫరా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజావాణి పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి.**

**మన దునియా ములుగు జిల్లా: ఏప్రిల్ 27**



ప్రజావాణి లో వచ్చిన పిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 దరఖాస్తు రాగా వాటిలో భూ సమస్యలు 09, ఇందిరమ్మ ఇండ్లు 10, పెన్షన్ 27, ఉపాధి కల్పన 02, ఇతర శాఖలకు



సంబంధించినవి 11 ఫిర్యాదులు అందాయి.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాంసం వండలేదని భర్త గొడవ.. కొడవలి విసిరిన భార్య


**మన దునియా,కామారెడ్డి:ఏప్రిల్ 27**



కామారెడ్డి:మాంసాహారం వండలేదన్న విషయంలో మొదలైన చిన్నపాటి గొడవలో క్షణికావేశానికి గురైన భార్య.. భర్తపైకి కొడవలి విసరడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లాకేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది.కామారెడ్డి పట్టణ సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. గోసంగికాలనీకి చెందిన కోదండం శివాజీ(28), లక్ష్మికి 2017లో వివాహమైంది. వీరికి ఐదేళ్లు, రెండేళ్లలోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మి ఇళ్లలో పనికి వెళ్తుండగా.. శివాజీ పాత సామాన్ల వ్యాపారం చేసేవారు. శనివారం రాత్రి ఇంటికి చేరుకున్న శివాజీ మాంసాహారం ఎందుకు వండలేదని భార్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పెద్దగా అరుచుకున్నారు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి సముదాయించడంతో కాసేపు ఊరుకున్నారు. మళ్లీ తనను తిట్టడంతో కోపోద్రిక్తురాలైన లక్ష్మి అక్కడే ఉన్న కొడవలిని శివాజీపైకి బలంగా విసిరారు. అది అతని మెడ భాగంలోని నరానికి తగిలి తీవ్ర రక్తస్రావమై 15 నిమిషాల వ్యవధిలోనే చనిపోయారు.క్షణికావేశంలో భర్తనే చంపుకొన్నానని, తాను జైలుకు వెళితే పిల్లలను ఎవరు చూసుకుంటారని ఇద్దరు బిడ్డలను ఒడిలోకి తీసుకొని లక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. శివాజీ సోదరుడు సూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

# ఎండల ఎఫెక్ట్: తెలంగాణలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి ప్రజలు విలవిల!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 27**




తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగ్గుమంటూ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత అధికమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, నల్లగొండ, ఆదిలాబాద్, భద్రాద్రి, కొమురంభీం జిల్లాల్లో గరిష్టంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే విధంగా సిద్దిపేట, మెదక్, నారాయణపేట, నాగర్‌కర్నూలు, సూర్యాపేట, ములుగు, కరీంనగర్ జిల్లాల్లో 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరాయి.ఇంకా ఖమ్మం, భూపాలపల్లి, హనుమకొండ, గద్వాల, సిరిసిల్ల, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ ప్రాంతాల్లో కూడా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రంగారెడ్డి, వనపర్తి, యాదాద్రి, మేడ్చల్ జిల్లాల్లో 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతూ ప్రజలను వేధిస్తున్నాయి.ఈ తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లడాన్ని తగ్గించుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకుండా ఉండడం, నీరు ఎక్కువగా తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం అవసరమని చెబుతున్నారు.

# అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ నిందితుడు పట్టివేత

**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:ఏప్రిల్ 27**

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, ఈ రోజు సాయంత్రం భూపాలపల్లి సిసిఎస్ బృందం ప్రత్యేక చర్యల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా చెల్పూర్ గ్రామానికి చెందిన కొండపల్లి పెద సారయ్య అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచినందుకు పట్టుకున్నారు.నిందితుడి వద్ద నుండి సుమారు 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం మరియు ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకోవడం జరిగింది.అనంతరం నిందితుడిని మరియు స్వాధీనం చేసిన వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ వారికి అప్పగించడం జరిగింది.ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ శాఖ హెచ్చరించింది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

**విశ్వహిందూ పరిషత్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేష్**

**పాడి పంటలకే కాదు సృష్టి సమతుల్యత కూడా గోవు ఆధారం**

**మన దునియా,మహబూబ్ నగర్ జిల్లా,బాల్ నగర్:ఏప్రిల్ 27**



గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని గో సండే కార్యక్రమంలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా బాల్ నగర్ మండలం ఎమ్మార్వో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసిన విశ్వహిందూ పరిషత్ మరియు హిందు వాహిని నాయకులు, విశ్వహిందూ పరిషత్ ప్రాంత నాయకులు బండారి రమేష్ మాట్లాడుతూ భారతదేశంలో గోవుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది ఒక మనిషి పొద్దున లేచినప్పటి నుండి తన రోజు ముగిసే వరకు గోవు ఆధారిత ఉత్పత్తులతో తన జీవనాన్ని కొనసాగించడం, అదే గోవు ఆధారంతో వ్యవసాయం, పాల పరిశ్రమలు మరియు పౌష్టికాహార ఉత్పత్తులలో కీలక పాత్ర పోషిస్తుంది గోమాతగా పూజించడం హిందూ ధర్మంలో భాగం గోమాతను హిందూ పురాణాలలో కామదేనువుగా వివరించడం జరిగింది గోమాత సకల దేవతలను తన శరీరంలో ఆశ్రమం కల్పించి గోవును పూజించిన ప్రతి ఒక్కరికి తన ఆశీస్సులు అందజేస్తుంది అటువంటి గోమాతను విదర్మీయులు చంపుతూ గోమాంసం భుజిస్తు హిందూ సంస్కృతి సంప్రదాయాలను హేళన చేస్తున్నారు, భారతదేశంలో పుట్టిన ప్రతి హిందూ పౌరుడు గోవును అమ్మగా భావించి గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించే వరకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా పోరాడాలని అన్నారు ఈ కార్యక్రమంలో చెట్ల వెంకటేష్ మార్వాడీ సంఘం నాయకులు గోపి కిషన్, శంకర్ లాల్ లాహుట్టి, మహావీర్ భారత్ , రాజు చారి , విపుల్ మల్లేష్, సతీష్ , ఉప్పల సంతోష్ బుల్లెట్ రాజు గారు తదితరులు పాల్గొన్నారు..

## గుమ్మడిదొడ్డిలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేసిన సర్పంచ్ కుమార్ భరత్ కుమార్

**మన దునియా, వాజేడు ,ఏప్రిల్ 27**



వాజేడు మండలం పరిధి లోగుమ్మడి దొడ్డి గ్రామపంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెరువు కట్టల మరమ మత్ పనులు ముమ్మరంగా సాగుతున్నారు ఎండల త్రీవత్త విపరీతంగా పెరుగుతుంది ఈ నేపథ్యంలో ఉపాధి కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక సర్పంచ్ మానవత్వాన్ని చాటుకున్నారు

**ఎండల దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**

సోమవారం ఉదయం పనులు జరుగుతున్న క్షేత్రస్థాయికి వెళ్ళిన సర్పంచ్ అక్కడ పనిచేస్తున్న సుమారు 80 మంది ఉపాధి కూలీలకు స్వయంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు భానుడి భగభగ లకు కూలీలు నిరసించి పోకుండా ఉండేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా సర్పంచ్ భరత్ కుమార్ కీలక సూచనలు చేశారు ఎండ త్రివేత్తల ఎక్కువగా ఉన్నందుకు పని సమయాలలో తలకు గుడ్డ కట్టుకొని తగినంత నీరు తాగితే జాగ్రత్తగా ఉండాలని కోరుకున్నారు ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు వీలైనంత త్వరగా పనులు ముగించుకొని ఇంటికి చేరుకోవాలని సూచించారు

## విద్యార్థుల ఫీజుల విడుదలకై ఏప్రిల్ 29న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్!!

**బీఆర్ఎస్వీ పోస్టర్ ఆవిష్కరణలో మహిపాల్ సుద్దాల పిలుపు**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) ఏప్రిల్:27.**



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ,బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఏప్రిల్ 29న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల ప్రకారం,ఈ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ నాయుడు మహిపాల్ సుద్దాల తెలిపారు.“విద్యార్థుల హక్కుల కోసం బిఆర్ఎస్వీ పోరాటం నిరంతరం కొనసాగుతుంది.ప్రభుత్వం స్పందించి ఫీజులు విడుదల చేసే వరకు మా ఉద్యమం ఆగదు.“ అని తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ పోరాటంలో విద్యార్థులు,తల్లిదండ్రులు మరియు విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌కు పూర్తి మద్దతు ప్రకటించాలని కోరారు.విద్యార్థి లోకానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ మరియు అనుబంధ విభాగాలన్నీ క్షేత్రస్థాయిలో పోరాడుతాయని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్,కౌన్సిలర్ రాజ గంగన్న,ఇంద్ర,రామునాయక్,ప్రదీప్,గౌరికర్ రాజు,దివాకర్,మహిపాల్, శ్రీను,గజేందర్,బాబార్బయ్,పెద్ది మల్లేష్,చింతల దాస్,చింటూ మనోజ్,నరేష్ చుక్కల,మండల పార్టీ ముఖ్య నాయకులు,బీఆర్ఎస్వీ కార్యకర్తలు మరియు విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం కార్మికులని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్

**మన దునియా,రంగారెడ్డి జిల్లా: ఏప్రిల్ 27**



తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) బికేఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ఇన్చార్జి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, జిల్లెడు చౌదరిగూడా ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షులు జిల్లెల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఈరోజు రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో కలెక్టర్ నారాయణ రెడ్డి గారికి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జూన్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉదయం టిఫిన్ పెట్టాలని ప్రతిపాదన తీసుకువచ్చింది. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇప్పుడు ఇస్తున్న కనీస వేతనం నెలకు 3000 రూపాయలు అవి కూడా ఒక్కసారి ఇవ్వడం లేదు ఉదయం టిఫిన్ పెట్టాలంటే ఉదయం తో పాటు మధ్యాహ్న భోజనం కూడా పెట్టాల్సిన అవసరం ఉన్నది. ఒకరోజు మొత్తం పని చేయవలసిన పని ఉన్నది. ప్రభుత్వం ఇచ్చే వేతనం ఏ మేరకు సరిపోని పరిస్థితి నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి గ్యాస్ ధరలు కూడా పెరిగాయి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు కూడా పెంచాల్సిన అవసరం ఉన్నది. ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి మెనూ చార్జీలు పెంపుదల చేయాలి. తెలంగాణ రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు అమలు చేయాలి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి. మధ్యాహ్న భోజన కార్మికులకు ఈఎస్ఐ ఈపీఎఫ్ ఇన్సూరెన్స్ గుర్తింపు కార్డులు సౌకర్యం కూడా కల్పించాలి. నిత్యవసర వస్తువులు అన్నిటిని కూడా రాష్ట్ర ప్రభుత్వమే సప్లై చేయాలని కోరుతున్నాము. మా విన్నపాన్ని మన్నించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతున్నాము. ఈ యొక్క కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లాలు చౌదరిగుడా మండల అధ్యక్ష కార్యదర్శులు చోటే మియా, శేఖర్ గౌడ్, శివ కల, కృష్ణయ్య, అరుణమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, స్వప్న, దివ్య, గంగ, జంగమ్మ, భాగ్యమ్మ, తదితరులు కార్మికులు పాల్గొన్నారు..

# పెట్రోల్ కొరత లేదని ఎవడన్నాడు..?





**బంకుల వద్ద వాహనదారుల క్యూ!**

**ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్నది వేరయా..**

**షాద్ నగర్ లో పెట్రోలు డీజిల్ దొరక్క అగచాట్లు**

**కొన్ని చోట్లలో పోలీస్ పహారాలో పెట్రోల్ డీజిల్ సరఫరా..**


**మన దునియా,షాద్ నగర్:ఏప్రిల్ 27**

ఎవడన్నాడు పెట్రోల్ డీజిల్ కొడత లేదని.. మా షాద్ నగర్ రండి కావలసినంత కొరత ఉంది. ఓ వైపు ప్రభుత్వ అధికారులు, మరోవైపు ప్రజా ప్రతినిధులు పెట్రోల్ డీజిల్ కొరతలేదని చెబుతూ కాలక్షేపం చేస్తుంటే సామాన్యుడు నడిబజారులో వాహనం చేత పట్టుకుని నెట్టుకుంటూ తోసుకెళు న్నాడు. మరోవైపు చేతిలో క్యాన్ డబ్బాలు పట్టుకొని పరిగెత్తుతున్నాడు. ఇవన్నీ కనిపిస్తున్న అధికారులు పెట్రోల్ డీజిల్ కొరతలేదని బుకాయిస్తున్నారు. గత రెండు రోజులుగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో తీవ్రమైన పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడింది. ప్రజలు తమ పనులు చేసుకోలేక రాకపోకలు కొనసాగించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని వాహనాలు తమ ఇండ్లకే పరిమితమయ్యాయి. అంతేకాదు తెలంగాణలో పలు చోట్ల పెట్రోల్, డీజిల్ కొరత సమస్య వెంటాడుతోందనీ ప్రజలు చెబుతున్నారు. చాలా ప్రాంతాల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయనీ పెట్రోల్ దొరుకదన్న భయంతో వాహనదారులు బంకుల దగ్గర క్యూ కడుతున్నారు. పెట్రోల్, డీజిల్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాలలో బంకు యజమానులే కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. మరోవైపు పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రజల్లో అయోమయం నెలకొంది. అసలే వివాహాల సీజన్ పెట్రోల్ డీజిల్ లభించక కార్యాలన్నీ అనేక కారణాల చేత చెడిపోతున్నాయి. ముఖ్యంగా ఇతర వ్యాపార లావాదేవీలు కూడా ఆగిపోయాయి. ప్రజలు ఇంట్లో నుండి బయటికి కాలు పెట్టలేని పరిస్థితి. పోవైపు మాడుతున్న ఎండలు మరోవైపు పెట్రోల్ డీజిల్ కొరతతో పూర్తిగా సతమతం అవుతున్నారు. షాద్ నగర్లో పెట్రోల్ బంక్ లు మూత , అన్నారం బైపాస్ లో ఒక బంక్ లో బారులు తీరిన వాహనాలు పోలీస్ పహారాలో పెట్రోల్ డీజిల్ సరఫరా.. జరుగుతున్న తీరు చూస్తే పరిస్థితి అర్థమవుతుంది..

# వెంకటాపురంలో యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించిన ఎస్సై కే తిరుపతిరావు

**మన దునియా, వాజేడు, ఏప్రిల్ 27**

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు అంబేద్కర్ సెంటర్ వద్ద నుండి కే తిరుపతిరావు వాహనదారులు ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు ఎలిమెంట్ మద్యం సేవించివాహనాలు నడపకూడదని అంశాలపై అవగాహన కల్పించారు తల్లిదండ్రులు మైనర్లు వాహనాలు ఇవ్వద్దని కేసులు నమోదు చేస్తా ము అని హెచ్చరించారు రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎదుర్కొ నే కష్టాలను గుర్తించుకోని భద్రత నియమాలు పాటించాలని సూచించారు అనంతరం అంబేద్కర్ సెంటర్ నుంచి భారీ ర్యాలీగా పోలీస్ సిబ్బంది వాహనదారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రెడ్డి ఏఎస్ఐ సాయి కృష్ణ పాల్గొన్నారు








మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# రైతు గోస పట్టదా?జన్నారంలో ధాన్యం కొనుగోళ్లపై పాలకుల నిర్లక్ష్యం!!

**తూకం వేయడంలో జాప్యాన్ని అరికట్టాలి**
**ప్రతి గింజా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి**
**వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని గోదాములకు తరలించాలి**
**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజారామ్ రెడ్డి డిమాండ్**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) ఏప్రిల్ 27,**

రుతుపవనాలు ముంచుకొస్తున్నా,ఆకాశం మేఘావృతమవుతున్నా పాలకుల్లో చలనం లేదు..అధికారుల్లో వేగం లేదు."అన్నం పెట్టే అన్నదాత అరిగోస పడుతుంటే..ప్రభుత్వం ఏం చేస్తోంది?" అంటూ జన్నారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజారామ్ రెడ్డి నిప్పులు చెరిగారు.సోమవారం స్థానిక తహశీల్దార్ బక్కయ్యకు వినతిపత్రం అందజేసిన సందర్భంగా ఆయన ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

**పేరుకే కేంద్రాలు..పనుల్లో శూన్యం!**

ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలనైతే ప్రారంభించింది కానీ,అక్కడ తూకం వేయడంలో దారుణమైన కాలయాపన జరుగుతోందని రాజారామ్ రెడ్డి ధ్వజమెత్తారు."కేంద్రాలు తెరిచారు సరే..తూకం ఎప్పుడు వేస్తారు?వేసిన ధాన్యాన్ని గోదాములకు ఎప్పుడు తరలిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు.

**ప్రభుత్వ వైఫల్యంపై విమర్శల బాణాలు!**

వర్షం ముప్పు:–

అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉంది.అప్పుడు రైతుకు జరిగే నష్టానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా?అని నిలదీశారు.

రవాణా జాప్యం:–

తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.



కళ్ళు తెరిపించేందుకే వినతి:–

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల కళ్ళు తెరిపించేందుకే తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు స్పష్టం చేశారు."రైతు కష్టాన్ని రోడ్డు పాలు చేయడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారింది.తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం."హెచ్చరించారు.రైతు సంక్షేమంపై మాటలు చెప్పే ప్రభుత్వం,క్షేత్రస్థాయిలో వారి కన్నీళ్లు తుడవడంలో మాత్రం విఫలమవుతోందని ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్,సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్,శ్రీనివాస్ రెడ్డి,భరత్, సత్యం, దేవయ్య,ప్రభుదాస్,నర్సాగౌడ్, ఎల్లయ్య, లక్ష్మీనారాయణ ,నర్సింహులు, మహేష్,రాకేష్,రవి,ప్రేమ్ సాగర్,శ్రీనివాస్,శ్రీధర్ రావు,సాయి కిరణ్, శ్రీనివాస్,మహేష్,అనుబంధ సంఘాల నాయకులు,వివిధ గ్రామాల కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జన్నారంలో మిన్నంటిన బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు!!

**గులాబీ జెండా ఆవిష్కరించిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు - గుర్రం రాజారామ్ రెడ్డి**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్),ఏప్రిల్ 27,**

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జన్నారం మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు,బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.

ఘనంగా జెండా ఆవిష్కరణ:–

మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జన్నారం మండల అధ్యక్షులు గుర్రం రాజారామ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.జై తెలంగాణ.. జై జై కెసిఆర్..అనే నినాదాలతో జన్నారం పురవీధులు మారుమోగాయి.ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్యకర్తల్లో ఉత్సాహం.. నేతల పిలుపు:–

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రాజారామ్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పుట్టిన



ఈ పార్టీ,నేడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని,రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్,శ్రీనివాస్ రెడ్డి,భరత్, సత్యం,దేవయ్య,ప్రభుదాస్,నర్సాగౌడ్, ఎల్లయ్య,లక్ష్మీనారాయణ, నర్సింహులు,మహేష్,రాకేష్,రవి,ప్రేమ్ సాగర్,శ్రీనివాస్,శ్రీధర్ రావు,సాయి కిరణ్,శ్రీనివాస్, మహేష్,అనుబంధ సంఘాల నాయకులు,వివిధ గ్రామాల కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గోరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి


**ఎమ్మార్వోకు సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో వినతి పత్రం**
**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

కమలాపూర్ మండలంలో గోవుల రక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో వినతి పత్రం సమర్పించారు. గో సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ గోమాత భారతీయ సంస్కృతిలో అత్యంత పూజ్యమైనదని, గోవును పూజించడం అంటే సర్వదేవతలను పూజించినట్లేనని తెలిపారు. గోమాత ఉన్న ఇల్లు గుడితో సమానమని, గోవు పాలు, పేడ, గోమూత్రం అన్నీ మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు.గోవులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, గోరక్షణ అంటే ధర్మాన్ని, ప్రకృతిని, భవిష్యత్ తరాలను కాపాడటమేనని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తిని గోవులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళనకరమని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.మహాత్మా గాంధీ, వేమన, స్వామి వివేకానందులు గోమాత ప్రాముఖ్యతపై చెప్పిన సందేశాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. గోరక్షణకు సమాజం మొత్తం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్ బాబు, ఓబీసీ జిల్లా నాయకులు కనుకుంట్ల అరవింద్, మౌటం సంపత్, అంకతి రాజేశ్వరరావు, బైరి సహదేవ్, మునేందర్, యుగంధర్, శనిగరపు సంపత్, దాసి రమేష్, జేరిపోతల లక్ష్మణ్, పరుష బోయిన విజయ్, కొలిపాక తిరుపతి, మంద రాజేష్, కాల్వ కుమారస్వామి, సాగర్, కోటి, రవి తదితరులు, హనుమాన్ మాలదారులు మరియు గోరక్షకులు పాల్గొన్నారు. గోవుల సంరక్షణపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.




# తాడిపత్రిలో దారుణం.. బైక్ తాళం కోసం స్నేహితుడి హత్య!

**బైక్ తాళం విషయంలో మొదలైన గొడవ విషాదాంతం**
**రాళ్లతో కొట్టి స్నేహితుడిని చంపేసిన స్నేహితులు**
**నిందితులు గౌస్, కార్తీక్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**మన దునియా,తాడిపత్రి:ఏప్రిల్ 27**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తాడిపత్రి పట్టణంలోని బంకమట్టి కాలనీకి చెందిన దూదేకుల అబ్దుల్లా, గౌస్, కార్తీక్‌లు స్నేహితులు. ఆదివారం రాత్రి అబ్దుల్లాకు చెందిన బైక్ తాళాన్ని స్నేహితులు కింద పడేశారు. ఈ విషయమై వారి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఆవేశానికి లోనైన గౌస్, కార్తీక్‌లు.. పక్కనే ఉన్న పదునైన నాపరాళ్లతో అబ్దుల్లా తల, ఇతర భాగాలపై విచక్షణారహితంగా దాడి చేశారు.ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన అబ్దుల్లా, అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడిపత్రి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన గౌస్, కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో బంకమట్టి కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# భీంపల్లిలో బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు



**కమలాపూర్, మన దునియా ప్రతినిధి**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లి గ్రామంలో

బిఆర్ఎస్, ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు కలిసి ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో పార్టీ పాత్రను స్మరించుకున్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు కొనసాగాయి. పలువురు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జై తెలంగాణ నినాదాలతో సందడి చేశారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు



వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్త్రంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

# కల్వకుంట్ల కవిత "బాణం"కారు కు ప్రమాదం

**కాంగ్రెస్ పార్టీకి నష్టం లేదు**

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు వరాలు**

**మరో 15 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం**

**టిఆర్ఎస్, బిఆర్ఎస్ అయినా ఉద్ధరించింది శూన్యం**

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం**

**వనపర్తి ఎమ్మెల్యే సంచలమైన వ్యాఖ్యలు**

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వనపర్తి ఎమ్మెల్యే వెల్లడి**

**మనదునియా,మహబూబునగర్:వనపర్తి:ఏప్రిల్ 27**

ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్విరామంగా కృషి చేస్తున్నారని వనపర్తి శాసనసభ్యులు తూడి.మేఘారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి నియోజకవర్గం లోని గోపాల్పేట మండలం తాడిపర్తి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన జర్నలిస్టులతో కొంతసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు వరాలు కురిపిస్తున్నాయని అన్నారు. దొడ్డ బియ్యం సన్న బియ్యం, మొక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు కష్టపడి పండించిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తూ రైతులకు నష్టం లేకుండా లాభం చేస్తుందని కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నా ఏకైక ప్రభుత్వంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని అన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని రైతులకు ఎక్కడ కూడా నష్టం లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తుందని అన్నారు. వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతుల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని అన్నారు.ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో గతంలో 10 సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ ఆ తర్వాత బిఆర్ఎస్ గా పేరు మార్చుకొని దివాలా తీసిందని విమర్శించారు. ఆ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన విషయం గుర్తు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో దోచుకున్న అక్రమ సంపాదన అవినీతి అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం గత 2023 ఎన్నికల్లో ప్రజా క్షేత్రంలో ప్రజలకు స్పష్టంగా వివరించడం జరిగిందని అందువల్లనే ఆ ప్రభుత్వానికి ప్రజలు గత ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పిన సంగతి గుర్తు చేశారు. అయినా కూడా ఈ రాష్ట్రంలో గతంలో ఎన్నో పార్టీలు టూరిస్టులుగా వస్తూ పోయాయని అందులో ముఖ్యంగా గతంలో వైఎస్ షర్మిల పార్టీ ఆ తర్వాత మధ్యకాలంలో కల్వకుంట్ల కవిత పార్టీ రెండు పార్టీలు దొందు దొందు అన్నారు. షర్మిల పార్టీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. అదే గతి కల్వకుంట్ల కవిత పార్టీ కూడా ఈ రాష్ట్రంలో మనుగడ సాధించదని ఆమె పార్టీ వల్ల కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని మరో 15 సంవత్సరాలు ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎవరికోసం ఎందుకోసం ఈ పార్టీలు ఎవరికోసం అంటూ ఆయన ఘాటుగా విమర్శించారు. కల్వకుంట్ల కవిత పార్టీ భారత రాష్ట్ర సమితి పార్టీ కారు గుర్తుకు నష్టం తప్ప కాంగ్రెస్ పార్టీకి ఒరిగేది ఏమీ లేదని కల్వకుంట్ల కవిత బాణం ఎవరు వదిలిన సంగతి త్వరలో తెలుస్తుందని ఆమె బాణం కారు గుర్తు టైర్ పంచర్ తప్ప మరొకటి కాదని అన్నారు. కవిత పార్టీపై ఆయన స్పందిస్తూ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. గతంలో పది సంవత్సరాలు పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం పై కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలు విమర్శలు ఆమె కొత్త పార్టీకి నిదర్శనమని అన్నారు. తండ్రి పైన నమ్మకం లేని కవిత స్పష్టంగా బిఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న లుకలుకలు బయట పెట్టిందని ఈ విషయం కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పెద్దలు ఆనాడే బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను అవినీతిని బయటపెట్టిన సంగతి గుర్తు చేశారు. భారత రాష్ట్ర సమితి పార్టీలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు కేటీఆర్ ,హరీష్ రావు, సంతోష్ రావు, ఉన్న సంగతి స్వయంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కూతురు కవితా బయట పెట్టిన విషయం ఆయన గుర్తు చేశారు. ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నారని ఎన్ని పార్టీలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టం లేదని అన్నారు. గతంలో ఎన్నో పార్టీలు ఈ రాష్ట్రంలో పుట్టుకొచ్చిన గాలిలో కలిసిపోయిన సంగతి గుర్తు చేశారు. కల్వకుంట్ల కవిత పార్టీ కూడా అదే గతి పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాటిపర్తి గ్రామ సర్పంచ్ లోకా రెడ్డి, ఆ గ్రామం జిపిఓ రుక్మిణి, వ్యవసాయ శాఖ మున్ననూరు తాడిపత్రి జైన తిరుమలాపూర్ గ్రామాలకు చెందిన ఏ ఈ ఓ శిరీష, తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ లేకుండ బీఆర్ఎస్ లేదు బీఆర్ఎస్ లేకుండ తెలంగాణ రాష్ట్రం లేదు!





**చెరిపితే చెరిగేది కాదు కేసీఆర్, హరీష్ రావుల తెలంగాణ రాష్ట్ర సాధన చరిత!**

**కాముని శ్రీనివాస్**

**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు**

**మన దునియా,చిన్నకోడూర్: ఏప్రిల్ 27**

భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావం మండల కేంద్రంలో గులాబీ జండ ఎగుర వేసిన సందర్భంగా మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ గారి త్యాగ ఫలితం అని కెసిఆర్ హరీష్ రావులు లేకుండా తెలంగాణ ఏర్పాటు సాధ్యమయ్యేది కాదని బి ఆర్ ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు 60 ఏళ్ల పోరాట కళ ను సాధ్యం చేయడానికి డిప్యూటీ స్పీకర్ గా రాజీనామా చేసి తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషిస్తూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసీఆర్ గారు అనేక రూపాలలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కెసిఆర్ గారికి దక్కుతుందని అన్నారు. మామ పోరాటంలో హరీష్ రావు వెన్ను దన్ను నిలిచి రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రాంతాన్నంత కలియ తిరుగుతూ పోరాటాన్ని ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో తన శక్తినంత ధారపోశారని అన్నారు.తెలంగాణ ప్రజల కల సహకారం చేసిన కేసీఆర్ హరీష్ రావులపైన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి అక్కస్సు వెలగక్కుతున్నారని ఇవాళ తెలంగాణ ద్రోహుల చేతిలోకి రాష్ట్రం పోయిందని తెలంగాణ ద్రోహుల చేతుల్లో రాష్ట్రం విలవిలలాడుతుందని నాటి పోరాటం మళ్లీ చేయాల్సిన పరిస్థితికి వచ్చిందని కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో నామరూపాలు లేకుండా చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో పిన్నింటి అబ్బిరెడ్డి, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కాల్వ ఎల్లం, పానుగంటి రమేష్, సాదిక్, పంపరి కనకయ్య, గుండెల్లి వేణు, తడకమడ్ల శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి, రఘు వర్మ, ఆనంద్, రాజిరెడ్డి, లక్ష్మయ్య, వర్డ్ మెంబర్స్ కొలను రమేష్, పిట్ల ప్రేమ్, పెసరి భాస్కర్, టేకు తిరుపతి, చెరుకు శ్రీకాంత్, బంక్క పోషయ్య, ఎయ్య రాజయ్య, బబ్బురు బాలకృష్ణ, బబ్బురు గణేష్, ఎలుక అనిల్, రాజిరెడ్డి, రెడ్డమేన స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే మాకు ముఖ్యం..వొడితల ప్రణవ్..






**ప్రజల్లో ఉనికి కాపాడుకోవడానికి కౌశిక్ రెడ్డి కొత్త నాటకాలు**

**గత ప్రభుత్వం ఇచ్చింది అన్న బండి సంజయ్ అప్పుడు ఎందుకు మాట్లాడలేదు.**

**డంప్ యార్డ్ కు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ కి తేడా తెలుసుకోండి**

**డంప్ యార్డ్ హుజురాబాద్ లో పెడతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదు**

**బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగిన హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్**

**మన దునియా ప్రతినిధి హుజురాబాద్ నియోజకవర్గం**

హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే మాకు ప్రధానమని,రాజకీయం కోసం బిఆర్ఎస్,బీజేపీ పార్టీలు చేస్తున్న కుటిల రాజకీయం ప్రజల్లోకి తీసుకెళ్తామని,డంప్ యార్డ్ పెడతామని ఎక్కడా చెప్పలేదని,వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్,డంప్ యార్డ్కు తేడా తెలుసుకోవాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సూచించారు.సోమవారం నాడు హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్ లో నియోజకవర్గ పరిధిలోనీ 5 మండలాలు రెండు పట్టణాలకు కలిపి 58,44,500/- విలువ చేసే 181 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు కష్ట కాలంలో మాకు అండగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ డంప్ యార్డ్ గురించి,వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారని,అస్సలు ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం ఎలాంటి ముందుకు వెళ్లకున్న ఏదో జరుగుతుందని ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారని,గత ప్రభుత్వం(బిఆర్ఎస్)లో ఈ ప్రతిపాదన వచ్చిందని,బీజేపీ పార్టీ ఎంపీ ఈటెల రాజేందర్,కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సజయ్ మాట్లాడారని అప్పుడు ఎమ్మెల్సీ గా ఉన్న కౌశిక్ రెడ్డి ఇది తెలిసి కూడా తన ఉనికిని కాపాడుకోవడానికి ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్సీగా,ఎమ్మెల్యేగా చస్తా అని శవ రాజకీయాలు తప్ప ప్రజల బాగోగుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు.

కేంద్ర మంత్రి బండి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన ప్రణవ్.

హుజురాబాద్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ గురించి మాట్లాడే ముందు కరీంనగర్ డంప్ యార్డ్ పై అక్కడి ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు ప్రణవ్..అక్కడి ప్రజలు డంప్ యార్డ్ మాకు వద్దు అని చెప్పినా ఎంపీగా,కేంద్ర మంత్రిగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇక్కడికొచ్చి స్పీచ్లు ఇవ్వడం అతని విజ్ఞతకే వదిలేస్తున్నామని,కౌశిక్ రెడ్డి,బండి సంజయ్ వ్యాఖ్యలు ఒకేలాగా ఉన్నాయని ఇద్దరు దొందూదొందే అని అన్నారు..వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ వేరే చోటుకు తరలించేలా మంత్రులను సంబంధిత అధికారులను కలిశామని,దానికి అనుగుణంగా మున్సిపల్ పాలకపక్షం ప్లాంట్ వేరే చోటుకు మార్చాలని తీర్మానం చేశామని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీగా ప్రజలకు హాని చేసే పని చేయమని మరోసారి పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని,హుజురాబాద్, జమ్మికుట కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డ్ సభ్యులు,దేవస్థాన చైర్మన్లు,మార్కెట్ చైర్మన్లు,డైరెక్టర్లు,మండల అధ్యక్షులు,మహిళా అధ్యక్షురాల్లు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మైనారిటీ,యువజన,బ్లాక్ కాంగ్రెస్,సేవాదళ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
ఏప్రిల్ | మంగళవారం | 28 | 2026



# ఐపీఎల్ 2026: ఢిల్లీ క్యాపిటల్స్ పై టాస్ గెలిచిన ఆర్సీబీ

**ఐపీఎల్ 2026లో ఢిల్లీ, బెంగళూరు మధ్య కీలక మ్యాచ్**

**టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్**

**తాము కూడా ఫీల్డింగే తీసుకోవాలనుకున్నామని చెప్పిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్**

**ఢిల్లీ జట్టులోకి చమీర, జేమీసన్‌లను తీసుకున్నామని అక్షర్ వెల్లడి**

**విజయపరంపరను కొనసాగించాలని చూస్తున్న బెంగళూరు**

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మధ్య కీలక పోరుకు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు.టాస్ గెలిచిన అనంతరం రజత్ పటీదార్ మాట్లాడుతూ.. "మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇది అధిక స్కోర్లు నమోదయ్యే మైదానం. ఛేజింగ్‌లో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నాం. మా జట్టులో వేర్వేరు మ్యాచ్‌లలో వేర్వేరు ఆటగాళ్లు రాణించడం సానుకూలాంశం. మంచి క్రికెట్ ఆడుతూ మా విజయాల జోరును కొనసాగించాలనుకుంటున్నాం" అని తెలిపారు.ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడుతూ.. "టాస్ గెలిస్తే మేం కూడా ఫీల్డింగే ఎంచుకునేవాళ్లం. ఇక్కడి పిచ్ ఛేజింగ్‌కు అనుకూలంగా మారుతుంది. గత మ్యాచ్‌లో 264 పరుగులు చేసినా ఓడిపోయాం. మా అత్యుత్తమ ఫీల్డర్లు కూడా క్యాచ్‌లు వదిలేశారు. అదృష్టం కలిసిరానప్పుడు దాని గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. ఈ మ్యాచ్‌లో రెండు మార్పులు చేశాం. ముఖేశ్ కుమార్‌కు విశ్రాంతినిచ్చి, పవర్‌ప్లేలో వికెట్లు తీయడం కోసం విదేశీ బౌలర్లు దుష్మంత చమీర, కైల్ జేమీసన్‌లను జట్టులోకి తీసుకున్నాం" అని వివరించారు.

**జట్ల వివరాలు:**

ఢిల్లీ క్యాపిటల్స్ సాహిల్ పరాఖ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీశ్ రాణా, సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ మిల్లర్, అక్షర్ పటేల్ (కెప్టెన్), దుష్మంత చమీర, కైల్ జేమీసన్, కుల్దీప్ యాదవ్, టి. నటరాజన్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ, రసిఖ్ సలామ్ దార్.



# చిన్నస్వామి స్టేడియంలో విధ్వంసం.. 240 సీసీ కెమెరాల ధ్వంసం.. ఇద్దరు నిందితుల అరెస్ట్

**ఆర్‌సీబీ–జీటీ మ్యాచ్ సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో భారీ భద్రతా లోపం**

**240కి పైగా సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్**

**సబ్ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన ఇద్దరు ఉద్యోగుల పనేనని నిర్ధారణ**

**రూ.10 లక్షల బకాయిలు చెల్లించలేదనే ఆగ్రహంతో ఈ చర్య**

**క్యూబన్ పార్క్ పీఎస్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ఐపీఎల్ 2026 మ్యాచ్ సందర్భంగా బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో భారీ భద్రతా వైఫల్యం వెలుగుచూసింది. ఈ నెల 24న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), గుజరాత్ టైటాన్స్ (జీటీ) మధ్య జరిగిన మ్యాచ్‌కు ముందు స్టేడియంలోని నిఘా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసిన ఇద్దరు వ్యక్తులను బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో దాదాపు 240 సీసీ కెమెరాలు పనిచేయకుండా పోయాయి. పోలీసుల ఎఫ్ఐఆర్ ప్రకారం చిత్రదుర్గ జిల్లా హిరియూర్‌కు చెందిన మంజునాథ్ (37), ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ కలాం (19) ఈ విధ్వంసానికి పాల్పడినట్లు గుర్తించారు. వీరు స్టేడియం డిజిటల్ సర్వైలెన్స్ బాధ్యతలు చూస్తున్న ఐవీఎస్ డిజిటల్ సొల్యూషన్స్ అనే సంస్థ కింద సబ్ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. డీయాక్టివేట్ చేసిన యాక్సెస్ కార్డును ఉపయోగించి, నిందితులు ఉదయం 11:30 గంటలకు స్టేడియంలోని సీసీటీవీ కంట్రోల్ రూమ్, సర్వర్ రూమ్ వంటి నిషేధిత ప్రాంతాల్లోకి ప్రవేశించారు. అక్కడ నెట్‌వర్క్ వీడియో రికార్డర్లు (NVRs), ఫైబర్ ఆప్టిక్ కనెక్షన్లను ధ్వంసం చేశారు. దీంతో ఎంట్రీ గేట్లు, కాన్కోర్సులు, డీ కార్పొరేట్ స్టాండ్ వంటి కీలక ప్రాంతాల్లోని కెమెరాలు పనిచేయడం మానేశాయి. సుమారు రూ.10 లక్షల బకాయిలు చెల్లించకపోవడంతోనే ఆగ్రహంతో ఈ విధ్వంసానికి పాల్పడినట్లు నిందితులు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. అయితే, ఈ వాదనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. కాంట్రాక్టర్ల పర్యవేక్షణ, యాక్సెస్ కంట్రోల్ విధానాల్లోని లోపాలను కూడా పరిశీలిస్తున్నారు.స్టేడియం నిఘా వ్యవస్థలతో సంబంధమున్న స్టాక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగి ఆదిత్య భట్ ఫిర్యాదు మేరకు క్యూబన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులు సున్నితమైన ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగిన వెంటనే అధికారులు అప్రమత్తమై, ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లు చేయడంతో మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకం కలగకుండా ముగిసింది. ఇదిలా ఉంటే.. ఐపీఎల్ 2026 షెడ్యూల్ ప్రకారం ఆర్‌సీబీ ఇప్పటికే బెంగళూరులో తన హోం మ్యాచ్‌లను పూర్తి చేసుకుంది. మిగిలిన మ్యాచ్‌లను రాయ్‌పూర్‌లో ఆడనుంది.



# నిప్పులు చెరిగిన హేజిల్‌వుడ్, భువీ... 75 పరుగులకే ఢిల్లీ ఢమాల్

**ఆర్సీబీ పేసర్ల ధాటికి 16.3 ఓవర్లలోనే కుప్పకూలిన ఢిల్లీ క్యాపిటల్స్**

**జోష్ హేజిల్‌వుడ్ 4, భువనేశ్వర్ కుమార్ 3 వికెట్లతో విధ్వంసం**

**ఐపీఎల్ చరిత్రలోనే అత్యల్ప పవర్‌ప్లే స్కోరు నమోదు చేసిన ఢిల్లీ**

**ఒంటరి పోరాటం చేసిన ఇంపాక్ట్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ (30)**



ఢిల్లీ క్యాపిటల్స్ తో ఐపీఎల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పేస్ బౌలర్లు నిప్పులు చెరిగారు. జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ కొత్త బంతితో సృష్టించిన విధ్వంసానికి ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. సోమవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు కేవలం 16.3 ఓవర్లలో 75 పరుగులకే కుప్పకూలింది. ఈ ఇద్దరు పేసర్లు కలిసి తొలి నాలుగు ఓవర్లలోనే ఆరు వికెట్లు పడగొట్టి ఢిల్లీ పతనాన్ని శాసించారు. టెస్ట్ మ్యాచ్‌ను తలపించేలా బంతిని స్వింగ్ చేస్తూ, బౌన్స్‌తో బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. హేజిల్‌వుడ్ కేవలం 12 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, భువనేశ్వర్ 5 పరుగులకే 3 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన చేశాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అభిషేక్ పోరెల్ (33 బంతుల్లో 30) మినహా మరే ఇతర బ్యాటర్ 20 పరుగుల మార్కును దాటలేకపోయారు.భువనేశ్వర్ కుమార్ వేసిన పదునైన ఇన్‌స్వింగింగ్ యార్కర్‌కు అరంగేట్ర ఆటగాడు సాహిల్ పరాఖ్ (0) క్లీన్ బౌల్డ్ కావడంతో ఢిల్లీ పతనం మొదలైంది. ఆ తర్వాత హేజిల్‌వుడ్ వరుస బంతుల్లో కేఎల్ రాహుల్, సమీర్ రిజ్వీలను ఔట్ చేసి ఢిల్లీని కోలుకోలేని దెబ్బతీశాడు. కాసేపు నిలిచిన ట్రిస్టన్ స్టబ్స్, కెప్టెన్ అక్షర్ పటేల్‌ను సైతం భువనేశ్వర్ తన అద్భుతమైన స్వింగ్‌తో పెవిలియన్‌కు పంపాడు. ఆ వెంటనే హేజిల్‌వుడ్ షార్ట్ బాల్‌కు నితీశ్ రాణా వెనుదిరగడంతో ఢిల్లీ 4 ఓవర్లలో 9 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. పవర్‌ప్లే ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 13 పరుగులు మాత్రమే చేసి, ఐపీఎల్ చరిత్రలోనే అత్యల్ప పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది.ఈ దశలో అభిషేక్ పోరెల్ (30), డేవిడ్ మిల్లర్ (19) కాసేపు ప్రతిఘటించారు. వీరిద్దరూ కలిసి 31 బంతుల్లో 35 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే, రసిఖ్ సలామ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి మిల్లర్ ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన కైల్ జేమీసన్ ఒక సిక్సర్ బాది ఢిల్లీని ఐపీఎల్ చరిత్రలో అత్యల్ప స్కోరు ప్రమాదం నుంచి గట్టెక్కించాడు. కానీ కృనాల్ పాండ్యా అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. సుయాశ్ శర్మ.. కుల్దీప్ యాదవ్‌ను బౌల్డ్ చేయగా, చివర్లో హేజిల్‌వుడ్ అద్భుతమైన యార్కర్‌తో పోరెల్‌ను క్లీన్ బౌల్డ్ చేసి ఢిల్లీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

## వార్ వన్ సైడ్... ఢిల్లీని ఓ చూపు చూసిన ఆర్సీబీ!


**ఢిల్లీ క్యాపిటల్స్‌పై 9 వికెట్ల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం**

**కేవలం 75 పరుగులకే కుప్పకూలిన ఢిల్లీ బ్యాటింగ్ లైనప్**

**హేజిల్‌వుడ్ 4, భువనేశ్వర్ 3 వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించారు**

**6.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి సత్తా చాటిన బెంగళూరు**

ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బౌలర్లు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారగా, ఆపై బ్యాటర్లు దుమ్మురేపారు. మొత్తమ్మీద వార్ వన్ సైడ్ చేసేశారు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో పూర్తి ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. ఆర్సీబీ పేసర్ల ధాటికి ఢిల్లీ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు కేవలం 75 పరుగులకే ఆలౌట్ కాగా, ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ కేవలం 6.3 ఓవర్లలోనే ఛేదించి భారీ విజయాన్ని నమోదు చేసింది.టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ నిర్ణయం సరైనదని ఆ జట్టు పేసర్లు నిరూపించారు. జోష్ హేజిల్‌వుడ్ (4/12), భువనేశ్వర్ కుమార్ (3/5) స్వింగ్‌తో ఢిల్లీ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. వీరి ధాటికి పవర్‌ప్లేలోనే ఢిల్లీ వెన్ను విరిగింది. ఒక దశలో 8 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ క్లిష్ట పరిస్థితుల్లో అభిషేక్ పోరెల్ (30) కాస్త పోరాడటంతో ఢిల్లీ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. డేవిడ్ మిల్లర్ (19) అతనికి కొద్దిసేపు సహకరించాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమవడంతో ఢిల్లీ 16.3 ఓవర్లలో 75 పరుగులకు ఆలౌటైంది.అనంతరం 76 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ జాకబ్ బెథెల్ (20) వికెట్ మాత్రమే కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ (13 బంతుల్లో 34 నాటౌట్), విరాట్ కోహ్లీ (15 బంతుల్లో 23 నాటౌట్)తో కలిసి మరో వికెట్ పడకుండా లాంఛనాన్ని పూర్తి చేశాడు. పడిక్కల్ 3 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి మ్యాచ్‌ను వేగంగా ముగించాడు.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన దువ్వాడ మాధురి.. పవర్‌ఫుల్ పాత్రతో సినీ ఆరంగేట్రం




**'చీన్ టపాక్ డుం డుం' అనే చిత్రం ద్వారా మాధురి టాలీవుడ్ ఎంట్రీ**

**గైరమ్మత్త అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ పోషిస్తున్న మాధురి**

**సినిమా ప్రారంభోత్సవానికి తరలి వచ్చిన సినీ ప్రముఖులు**

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తో ఉన్న అనుబంధం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో పాప్యులర్ అయిన మాధురి... ఇప్పుడు నటిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 'చీన్ టపాక్ డుం డుం' అనే విభిన్నమైన టైటిల్‌తో వస్తున్న చిత్రం ద్వారా ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో మాధురి 'గైరమ్మత్త' అనే గంభీరమైన పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. తాజాగా విడుదలైన ఆమె పోస్టర్ చూస్తుంటే, సినిమాలో ఆమె పాత్ర చాలా వైవిధ్యంగా ఉండబోతోందని అర్థమవుతోంది. 'శుభం' సినిమా ఫేమ్ గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా నటిస్తుండగా, ఆయన సరసన బ్రిగిడా సాగా హీరోయిన్‌గా నటిస్తోంది. వైఎన్ లోహిత్ దర్శకత్వంలో 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి టాలీవుడ్ స్టార్స్ తరలివచ్చారు. స్టార్ హీరోయిన్ సమంత క్లాప్ కొట్టగా, గోపిచంద్ మలినేని, నందిని రెడ్డి, వశిష్ఠ వంటి ప్రముఖులు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్టు నెలలో విడుదల చేసేందుకు యూనిట్ ప్లాన్ చేస్తోంది.

## అషు రెడ్డి కేసులో సంచలన విషయాలు.. ఆత్మహత్య బెదిరింపులు

**అషు రెడ్డి చుట్టూ హనీ ట్రాప్ ఆరోపణలు**

**తన నుంచి రూ. 9.35 కోట్ల వరకు లాగేసిందంటూ ధర్మేంద్ర ఫిర్యాదు**

**డబ్బు అడిగినప్పుడల్లా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందని వెల్లడి**

టాలీవుడ్ నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అషు రెడ్డి చుట్టూ అల్లుకున్న 'హనీ ట్రాప్' ఆరోపణల ఉదంతం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోంది. అషు గురించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మేంద్ర పలు సంచలన విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా తాను ఇచ్చిన డబ్బును అడిగినప్పుడల్లా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించేదని ఆయన కీలక విషయానని తెలియజేశారు. పెళ్లి చేసుకుంటాననే సాకుతో అషు రెడ్డి, ఆమె కుటుంబ సభ్యులు తనను నిలువునా ముంచారని ధర్మేంద్ర ఆరోపించారు. 2018 నుంచి 2025 వరకు సాగిన ఈ వ్యవహారంలో ఆస్తులు, నగదు రూపంలో సుమారు రూ. 9.35 కోట్లు కాజేసినట్లు పోలీసుల ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. ప్రారంభంలో తన ఎడ్యుకేషన్ లోన్, వీసా సమస్యలు, సినీ కెరీర్ ఖర్చుల పేరుతో అషు రెడ్డి తన నుంచి భారీగా డబ్బు తీసుకున్నట్లు ధర్మేంద్ర తెలిపారు. ధర్మేంద్ర ఇచ్చిన డబ్బుతో అషు రెడ్డి మణికొండలో ఒక ఫ్లాట్ (రూ. 1.80 కోట్ల అడ్వాన్స్), సుమారు 5 కిలోల బంగారం, ఖరీదైన కార్లు కొనుగోలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు తిరిగి అడిగినప్పుడల్లా తాను ఆత్మహత్య చేసుకుంటానని అషు రెడ్డి బెదిరించేదని, గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేసిందని బాధితుడు వెల్లడించారు. ఈ ఆరోపణలను అషు రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఖండించారు. తనపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు.





## రాజ్ చాలా గ్రేట్: భర్తపై సమంత ప్రశంసలు

**గత డిసెంబర్ 1న రాజ్ నిడిమోరును పెళ్లాడిన సమంత**

**నిర్మాతలుగా 'మా ఇంటి బంగారం' సినిమాను నిర్మిస్తున్న జంట**

**రాజ్ అద్భుతమైన క్రియేటర్ అని ప్రశంసించిన సమంత**

దర్శకుడు, నిర్మాత రాజ్ నిడిమోరును ప్రముఖ సినీ నటి సమంత వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇద్దరికీ ఇది రెండో వివాహం కావడం గమనార్హం. మరోవైపు, వీరి జీవిత ప్రయాణం సంతోషంగా, అన్యోన్యంగా ముందుకు సాగుతోంది. వ్యక్తిగతంగానే కాకుండా వృత్తిపరంగానూ సమంత-రాజ్ నిడిమోరుల బంధం మరింత బలపడుతోంది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి విజయవంతమైన ప్రాజెక్టుల తర్వాత, ఇప్పుడు ఈ జంట 'మా ఇంటి బంగారం' సినిమా కోసం జట్టు కట్టారు. సమంత సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' ద్వారా రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వంలో వస్తున్న ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా వెన్నెల కిషోర్ అడిగిన 'మీ ఫ్యామిలీ మ్యాన్' ఎలా ఉంటారు? అనే ప్రశ్నకు సమాధానంగా.. "రాజ్ చాలా గ్రేట్, ఆయనో అద్భుతమైన క్రియేటర్" అంటూ సమంత తన భర్తపై ప్రశంసలు కురిపించడం వారి మధ్య ఉన్న గౌరవాన్ని చాటిచెబుతోంది. 2025 డిసెంబర్ 1న కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో అత్యంత నిరాడంబరంగా జరిగిన వీరి వివాహం అప్పట్లో పెద్ద సంచలనం. ఇప్పుడు పెళ్ళైన తర్వాత వస్తున్న వీరి కాంబినేషన్లో వస్తున్న తొలి చిత్రం కావడంతో ఫ్యాన్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒక సాధారణ గృహిణి పవర్‌ఫుల్ మహిళగా ఎలా మారిందనే కాన్సెప్ట్‌తో 'ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్'గా వస్తున్న ఈ సినిమా మే 15న విడుదల కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com